పరిచయం :

## ★ ఆంధ్రుల అందమైన పిల్ల:

# మా కాసులు

పుట్రేవు సుందరరావు

★



ఆ అమ్మాయికి అయిదారేళ్లుంటాయి. అసలు పేరు కామేశ్వరి—అయితేనేం? అందరూ ముద్దుగా కాసులూ అని పిలుస్తుంటారు. నేనూ అల్లాగే పిలుస్తా. కాసుల్ని పరిచయం చేశాడు వాళ్లన్నయ్య సారథి. "నమస్కారమండీ" సుతారంగా పలికి చక్కగా చేతులు యెత్తింది. ఆమె వేళ్లు చాలా ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి. "నమస్తే" అన్నాను నేనూ. దగ్గరకి రమ్మని పిలిచాను. తెలుగుపిల్లలకి ఉండే సహజమైన సిగ్గుతోటి కొంచం దూరంగా కూర్చుంది.

సారథి సిగరెట్టు వెలిగించి "పాడవే కాసులూ" అన్నాడు. "ఊఁహు" అని బుర్ర వూపింది. "ఒక్కపాట-పాడవూ కాసులూ" అన్నా నేను బతిమాలుతూ. నా మాటని తోసెయ్యకుండా పాట యెత్తుకుంది కాసులు. "నావికా—పాటలు పాడవోయ్, పడవను నడుపవోయ్—వాలుగాలి వీలుగాను వీచుచుండె-నావికా" అంటూ చక్కగా పాడింది. మహతిలోంచి వచ్చే నాదతరంగాల్లా, ఆమె కంఠంలోంచి మధురమైన యీ పాట విన వచ్చింది! "మరి—మీరు పాడండి" అంది నాకేసి చూస్తూ. "నేనా!" అన్నాను ఆశ్చర్యపోయి. నా గొంతుక సంగతి ఆమెకి యేం తెలుసు? పాడేనంటే దడుసుకోదూ? అందుకని కబుర్లలో పెట్టేశాను. "ఏమండీ! పోనీ కథ చెప్పండి" అంటూ దగ్గరకి వచ్చింది కాసులు. పల్చని గులాబి రేకుల్లాంటి చెంపలూ, సంపెంగపూవుల్లాంటి తీరైన నాసికా, కాటుక రేఖలు దిద్దిన విశాలనయనాలూ, పసిమిఛాయల చక్కని కోలముఖమూ—మరి కాసులు యింక అందంగా వుండక యెల్లా వుంటుంది చెప్పండి?

కథలంటే చెవులు కోసుకొంటుంది కాసులు. పద్మావతీ చరణచారణ చక్రవర్తి అయిన జయదేవ మహాకవి గీతగోవింద శ్లోకాన్ని పాడుతూ అభినయించే కాసుల్ని చూస్తే—ఆశ్చర్యపడకుండా వుండలేకపోయాను! ఆమెకి సరియైన శిక్షణ ఇస్తే నిజమైన నర్తకి అవుతుందనడంలో సందేహం లేదు! ఎప్పుడూ నవ్వుతూ, ఖులాసాగా ఆడుకొంటూ, తనలో తనే తియ్యగా పాడుకొంటూ, నడకలో, చూపులో నాట్యవిన్యాసాన్ని ప్రదర్శించే కాసులు యొక్క పరిచయం లభించడం నా అదృష్టంకాదూ? వాళ్ల యింట్లో వున్న నాలుగు రోజులూ—ఎన్నో కబుర్లుచెప్తూ నాతోనే తిరిగింది కాసులు!

సోదరి కామేశ్వరి, అందరూ ఎంతో ముద్దుగా పిలచే మా కాసులు—మంచి భవిష్యత్తు ఉన్న ఆంధ్రుల అందమైన పిల్ల అని మీకు పరిచయం చేస్తున్నాను.